క్లుప్తంగా

టేబుల్ టెన్నిస్‌లో విద్యార్థుల ప్రతిభ



గుడ్లవల్లేరు: జేఎన్‌టీయూకే అంతర్ కళాశాలల టోర్నమెంట్‌లో శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ క్రీడాకారులు విజయ కేతనం ఎగురవేశారు. సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్ తెలిపారు. జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో యూనివర్సిటీ స్థాయిలో అంతర్ కళాశాలల టోర్నమెంట్ నిర్వహించినట్లుచెప్పారు. టేబుల్ టెన్నిస్ మహిళల విభాగంలో ప్రథమం, పురుషుల విభాగంలో తృతీయ స్థానం సాధించిన ట్లు పేర్కొన్నారు.వ్యాయామ అధ్యాపకుడు ఎం. శివశంకర్, డి.పూజితను కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి సత్యనారాయణ, సహకార్యదర్శి రామకృష్ణ, సలహాదారు డాక్టర్ పి.రవీంద్రబాబు, వైస్ ప్రిన్సిపాల్ కోదండ రామారావు అభినందించారు.

జల్‌జీవన్ పనుల పరిశీలన

మండవల్లి: మండలంలోని పెరికెగూడెం జగనన్న కాలనీలో రూ.40 లక్షల జల్‌జీవన్ మిషన్ నిధులతో జరుగుతున్న పైపులైన్ నిర్మాణ పనులను సర్పంచ్ పెరుమాళ్ల పద్మ సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీలో 300 మందికి, గ్రామంలో 100 మంది మొత్తం 400 మందికి జల్‌జీవన్ మిషన్ ద్వారా పైపులు అందజేయనున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు పెరుమాళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నిధులతో గ్రామంలోని ప్రతి ఒక్కరికీ పైపు సౌకర్యం ఏర్పడుతుందన్నారు.

వివాహిత అదృశ్యం



కైకలూరు: స్థానిక వెలంపేట 18వ వార్డుకు చెందిన వివాహిత కొత్తపల్లి నాగమల్లేశ్వరీ (40) కనిపించడం లేదంటూ కైకలూరు టౌన్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు అందింది. టౌన్ ఎస్సై ప్రతాప్‌రెడ్డి చెప్పిన వివరాల మేరకు.. ఆదివారం రాత్రి స్థానిక సాయిబాబా గుడికి వెళ్లి వచ్చి కుటుంబ సభ్యులతో కలసి భోజనం చేసింది. తర్వాత నుంచి కనిపించలేదు. రెండేళ్లుగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో అప్పుడప్పుడు బయట గ్రామాలకు వెళ్లడం జరుగుతోందని కుటుంబ సభ్యులు చెప్పారని ఎస్సై తెలిపారు. ఆమెను గుర్తించిన వారు వెంటనే 94407 96434, 94407 96433 సెల్ నంబర్లకు తెలియచేయలన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ముదినేపల్లి రూరల్: మండలంలోని చిన్నపాలపర్రు, కోడూరు గ్రామాల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సులు సోమవారం నిర్వహించారు. కేడీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ముదినేపల్లి బ్రాంచి మేనేజర్ చంద్రశేఖర్, సూపర్‌వైజర్ సత్యశ్రీనివాస్‌రావు మాట్లాడారు. సహకార కేంద్రబ్యాంకు అందిస్తున్న సకల రుణాలు, పొదుపు ఖాతాల వల్ల కలిగే లాభాలు, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి అంశాలను వివరించారు. సదస్సుల్లో కళాజాతా బృందాల సభ్యులు కేంద్ర సహకార బ్యాంకు పథకాలను వివరించారు. ఈ సదస్సుల్లో స్థానిక సొసైటీ అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు 'ఆడుదాం ఆంధ్రా'పై సదస్సు

ముదినేపల్లి రూరల్: మండలంలో ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమానికి సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పీ మల్లీశ్వరీ తెలిపారు. కార్యక్రమ నిర్వహణ తీరుతెన్నుల గురించి పాటించాల్సిన విధివిధానాల గురించి వివరిస్తారన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీల సభ్యులు, పంచాయతీల కార్యదర్శులు, అధికారులు సదస్సులో పాల్గొనాలని కోరారు.

వృద్ధాశ్రమానికి సాయం

గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ గుడివాడ సేవా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేశారు. స్థానిక పాటిమీద గల కరుణాపీఠం వృద్ధాశ్రమానికి క్లబ్ సభ్యురాలు కంచర్ల కృష్ణవేణమ్మ వితరణతో పండ్లు, కూరగాయలు, బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. అధ్యక్షుడు అర్జా ప్రసాదు, కార్యదర్శి వంగపండు బ్రహ్మాజీ, కోశాధికారి చింతా రామకృష్ణ, ఈశ్వర వెంకటేశ్వరరావు, బొగ్గారపు తిరుపతయ్య, శివరామకృష్ణ పాల్గొన్నారు.

గుడివాడ సీసీఎస్ ఎస్‌ఐగా దాసు



కోనేరుసెంటర్: గుడివాడ సీసీఎస్ ఎస్‌ఐగా ఎస్.స్వామిదాసు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం జిల్లా ఎస్పీ పి.జాషువాను జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఎస్ఐ దాసును ఎస్పీ అభినందించారు. అంకితభావంతో విధులు నిర్వర్తించి, పోలీస్ శాఖకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ సూచించారు.

సంక్షేమ సారథి జగన్‌తోనే అభివృద్ధి



వైవాకలో మాట్లాడుతున్న ఎంపీపీ రామిశెట్టి



సదస్సులో మాట్లాడుతున్న శశిభూషణ్



కలిదిండిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎంపీపీ, పార్టీ నాయకులు



ఐలూరులో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ



దేవరపేట-2లో బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ముదినేపల్లి రూరల్: సంక్షేమ పథకాల రథసారధి ముఖ్యమంత్రి జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని వైవాకలో 'ఏపీకి జగనన్నే ఎందుకు కావాలి'.. కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ కుల, మత ప్రాంతాలకు అతీతంగా పాలిస్తున్న ముఖ్యమంత్రి జగనన్న అనేక సంక్షేమ పథకాలను పారదర్శకంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. జన్మభూమి కమిటీలు తిరిగి రంగప్రవేశం చేసి ప్రజలను దోచుకు తినకుండా ఉండాలంటే జగనన్నే తిరిగి ముఖ్యమంత్రి కావాలన్నారు. తొలుత గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని, సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నున్న పద్మావతి, ఎంపీటీసీ బోయిన నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు నీలపాల రామకృష్ణ, మాజీ అధ్యక్షుడు పైడిపాటి వెంకటరమణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మోట్రు ఏసుబాబు, కుర్మా శ్యాముల్, బండెల ప్రభాకర్, నున్న కనకరాజు, నగుళ్ళ వెంకటేశ్వరరావు, రాచూరి కుమార్, నేతల ప్రవీణ్, దొడ్డాకుల చంద్రమోహన్, ఆకునూరి ఈశ్వరనారాయణ, దివి సతీష్, పేర్ని పృథ్వీ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: పేదల సంక్షేమానికి వెన్నుదన్నుగా జగనన్న ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా తలపెట్టిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ అన్నారు. 'ఏపీకి జగనన్నే ఎందుకు కావాలి', 'పల్లెకు పోదాం' కార్యక్రమాలను దోకిపర్రులో సోమవారం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ పథకాల వలన లబ్ధి పొందిన వారికి అవగాహనా సదస్సులను నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, ఎంపీడీఓ డి.శ్రీనివాస్, తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్ మస్తానా, ఎంపీపీ కొడాలి సురేష్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శాయన రవి, పార్టీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు కనుమూరి రామిరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు నాగు, ఈఓపీఆర్డీ వి.దిలీప్ కుమార్, సిబ్బంది. వలంటీర్లు పాల్గొన్నారు.

రూ.42.82 కోట్లతో అభివృద్ధి

పమిడిముక్కల: గ్రామంలో 'ఏపీకి జగనే ఎందుకు కావాలి', పల్లెనిద్ర కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. డీబీటీ కింద రూ.29.53 కోట్లు, నాన్ డీబీటీ కింద రూ.13.08 కోట్లు కలిపి మొత్తం రూ.42.82 కోట్లతో గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఓ రాజు, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్, ఎంపీటీసీ గుర్విందపల్లి వంశీ, వైస్ ఎంపీపీలు గంజాల సీతారామయ్య, కొడమంచిలి మహేష్, పీఏసీఎస్ చైర్మన్ మైనేని కోటేశ్వరరావు, పార్టీ నాయకులు పాతూరి చంద్రపాల్, మన్నే కిషోర్, ఇమడాబత్తిన తిరుమలరావు, బొల్లా రాంబాబు, పెనుమత్స రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమ, అభివృద్ధి

తోట్లవల్లూరు: ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పాలన కావాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఉందని ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఐలూరులో పల్లెకుపోదాం, ఏపీకీ జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమాలు సోమవారం సాయంత్రం జరిగాయి. గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేయటంతోపాటు సమావేశం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, గుర్విందపల్లి సర్పంచ్ ఉమ్మడిశెట్టి ఉదయభాస్కర్, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ నడకుదురు రాజేంద్ర, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ లతీఫ్, పీఏసీఎస్ అధ్యక్షుడు వీరబాబు, సోషల్ మీడియా కో కన్వీనర్ వల్లభాపురపు రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: పట్టణం దేవరపేట-2 సచివాలయ పరిధిలో సోమవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనన్న ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు ఈ కార్యక్రమంలో నాలుగున్నర సంవత్సరాల జగన్ మోహనరెడ్డి పాలనలో ప్రజలకు చేసిన మేళ్లను వివరించారు. నవరత్నాలలో అమలు చేసిన పథకాల ఫలితాలను ప్రజలకు తెలిపారు. వక్తలు మాట్లాడుతూ సచివాలయ పరిధి లోని 4,838 మంది లబ్దిదారులకు ప్రత్యక్షంగా రూ. 12 కోట్ల 43 లక్షల 13 వేల 981, పరోక్షంగా 2,182 మంది లబ్దిదారులకు రూ.7 కోట్ల 69 లక్షల 47 వేల 202, మొత్తం రూ.20 కోట్ల 12 లక్షల 61 వేల 183 వంతున లబ్ది చేకూర్చామని వివరించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాజీ, సంచార జాతుల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ షేక్ సయ్యద్, దుడ్డు చిన్నా, వెంపటి సైమన్, మైనార్టీ నాయకులు అబ్దుల్ గఫార్, అబ్దుల్ రహీమ్, ఎండీ జలీల్, ఎండీ యాకూబ్, ఖాదర్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ సీఎంగా జగనే కావాలి

కలిదిండి: ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకుందామని ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు కోరారు. కలిదిండి-2 సచివాలయంలో సోమవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి ఉండాలన్నారు. పథకాల బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, జెడ్పీటీసీ బొర్రా సత్యవతి, వైస్ ఎంపీపీ కట్టా నాగలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమాని రమేష్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు పాము రవికుమార్, గ్రామ సర్పంచ్ మసిముక్కుల మారుతి ప్రసన్న, పీఏసీఎస్ అధ్యక్షుడు వడుపు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోండి

- విజయవాడ డివిజన్ ఎస్ఎస్‌పీ ఆసిఫ్
- అలీనఖీపాలెంలో తపాలాశాఖ నూతన కార్యాలయం ప్రారంభం



అలీనఖీపాలెంలో మాట్లాడుతున్న ఎస్ఎస్‌పీ ఆసిఫ్

పమిడిముక్కల: పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ డివిజన్ పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ ఆసిఫ్ సూచించారు. మండలంలోని అలీనఖీపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన శాఖ తపాలా కార్యాలయాన్ని ఎస్ఎస్‌పీ సోమవారం ప్రారంభించారు. ఐపీఓ కిరణ్ కుమార్, బీపీఎం ప్రమీలారాణిని బ్రాంచి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. సర్పంచ్ జైనాబ్ సుల్తాన్ బేగం, కార్యదర్శి రమణను గ్రామం వివరాలు అడిగి, బ్రాంచి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ తేలప్రోలు వద్ద గాలిగోపురం బీఓ మూతపడటంతో, ఆ బీఓను అలీనఖీపాలెం తరలించినట్లు తెలిపారు. ఇప్పటివరకు అలీనఖీపాలెం గ్రామం చోరగుడి బీఓ పరిధిలో ఉండేదని, చోరగుడి నుంచి విడదీసి అలీనఖీపాలెంలో నూతన బీఓను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలీనఖీపాలెం గ్రామస్తులకు బీఓ అందుబాటులోకి వచ్చిందని, ఇంటింటా ఎస్‌బీ, ఆర్డీ ఖాతాలు తెరచి బ్రాంచి అభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలలోని రైతులు, కూలీలు, మహిళలు, కార్మికులు, బలహీన వర్గాలకు ఆర్‌పీఎల్ఐ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గ్రామంలో బ్రాంచిని ప్రారంభించినందుకు సర్పంచ్ బేగం కృతజ్ఞతలు తెలిపారు. ఐపీఓ, ఎమ్ఓలు, పోస్టల్ ఉద్యోగులు ఎస్ఎస్‌పీ ఆసిఫ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉయ్యూరు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఎమ్ఓలు జగన్మోహనరావు, నాగలక్ష్మి, వీరంకిలాకు ఎస్‌పీఎం సురేష్, బీపీఎం ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

తోట్లవల్లూరు: మిచాంగ్ తుపాను కారణంగా అన్నదాతలకు కోలుకోలేని నష్టం వాటిల్లిందని, దీనిని కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు డిమాండ్ చేశారు. మండలంలోని రొయ్యూరులో తుపాను కారణంగా దెబ్బతిన్న అరటి, తమలపాకు తోటలను సోమవారం ఆయన సందర్శించి పరిశీలించారు. తుపాను కారణంగా అరటి, తమలపాకు, వరి రైతులకు నష్టం భారీగా వాటిల్లిందని రుద్రరాజు అన్నారు. ఎకరం అరటికి రూ.లక్షన్నర వరకు నష్టం జరిగిందన్నారు. వరికి హెక్టారుకి రూ.17,500 పరిహారం చాలదని కనీసం రూ.50 వేలు ఇవ్వాలని ఆయన కోరారు. రెండో పంటైన మినుముకు కూడా తీవ్ర నష్టం జరిగిందన్నారు. పంటలు దెబ్బతిన్న రైతులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకోవాలన్నారు. గత కాంగ్రెస్ హయాంలో విపత్తులు వచ్చినప్పుడు రైతులను అన్ని విధాలా ఆదుకున్నామని తెలిపారు. పీసీసీ ఉపాధ్యక్షుడు ధనేకుల మరళీమోహనరావు, గొల్లు కృష్ణ, పీసీసీ ప్రధానకార్యదర్శి మొవ్వా మోహనరావు, విజయవాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరశెట్టి నరశింహారావు, స్థానిక నాయకులు గన్నే కోటేశ్వరరావు, వల్లభనేని చెన్నయ్య పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



చేవూరు ప్రార్థనామందిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: శాంతి, సహనం, ప్రేమ ప్రతి ఒక్కరిపై చూపాలన్న క్రీస్తు బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండలంలోని చేవూరు సీఎస్సై ప్రార్థనా మందిర ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఎమ్మెల్యే డీఎన్నార్, బిషప్ తంటిపూడి జార్జ్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవాళికి క్రీస్తు చూపిన మార్గం ఎంతో ఉత్తమమైనదిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీ చొప్పర్ల సునీత, సర్పంచ్ వల్లభనేని లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు పాతూరి సీతారామంజనేయులు, జాస్తి చంటి, సాక్షి సాయిబాబు, పత్తిపాటి రాజేష్, వల్లభనేని వెంకట్రావు, ఊరి పెద్దలు, సంఘస్తులు, విశ్వాసులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తిక దీపోత్సవం



గుడివాడలో దీపారాధనలు చేస్తున్న భక్తులు



పామర్రులో శివలింగాకారంలో దీపాలను వెలిగించిన భక్తులు

కొండిపర్రు(పామర్రు): గ్రామంలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం పురస్కరించుకుని ఆలయంలో కార్తిక దీపాలను వెలిగించి పూజలు చేశారు. తొలుత ఆలయంలోని మల్లేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శివలింగకారం ఏర్పాటు చేసి, ఆ కారం చుట్టూ దీపాలను వెలిగించి దీపపు పూజలు చేశారు. మహిళలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించి పూజలు చేశారు. అర్చకులు రాము ఆధ్వర్యంలో ఆలయంలో పూజాధికాలుజరిగాయి.

ఆలయాల్లో కార్తిక సందడి

పామర్రు: కార్తిక మాసం చివరి సోమవారం సందర్భంగా ఆలయాలకు భక్తుల తాకిడి ఎక్కువైంది. మండల పరిధిలోని శైవాలయాలతో పాటు విష్ణాలయాల్లో కూడా భక్తులు పూజలు చేశారు. స్థానిక సోమేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజామునుంచి భక్తులు కార్తిక స్నానాధికాలను పూర్తిచేసుకునిఆలయానికి చెరుకున్నారు. ఆలయంలో దీపాలను వెలిగించి పూజలు చేశారు. స్థానిక విష్ణాలయంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించి దీపపు పూజలు నిర్వహించారు. అంకమ్మతల్లి ఆలయంలో రేణుకా పరమేశ్వరుని ఆలయంలో భక్తులు స్వామికి విశేషంగా అభిషేకాలు, స్వామికి విశేష పూజలను చేశారు.

కార్తిక సోమవారం వ్రతాలు

మండవల్లి: మండలంలో కార్తిక సోమవారం సందర్భంగా పలువురు వ్రతాలు నోచుకున్నారు. స్థానిక శ్రీ భ్రమరాంబసమేత మల్లేశ్వరస్వామి ఆలయం, రామాలయం, ఆంజనేయస్వామి ఆలయం తదితర ఆలయాలకు వెళ్లి విశేష పూజలు జరిపారు. అర్చకులు భక్తులచే పూజలు జరిపించారు.

కలిదిండి: కార్తిక మాసం చివరి సోమవారం కావడంతో శివాలయాలన్నీ భక్తులతో పోటెత్తాయి. శివనామస్మరణలో మార్మోగాయి. తెల్లవారుజామునుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో ఆలయాలు రద్దీగా మారాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించారు. దేవదాయశాఖ శింగనపల్లి శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పామర్రు: స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలో కార్తిక మాసం చివరి సోమవారం పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో భక్తులు కాజ వర ప్రసాద్, రాధామణి దంపతుల చేత సహస్రదీపోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత కార్తిక దామోద స్వామికి విశేషంగా పూజ చేశారు. అనంతరం శివ లింగాకారం, నామం, శంఖు, చక్రాలు, పద్మం తదితర ఆకారాలలో దీపాలను వెలిగించారు. ఆలయ అర్చకులు రొంపిచర్ల ప్రసాద్, ఆర్.రంగప్రసాద్, ఆర్.గోపిల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పమిడిముక్కల: స్థానిక గంగా పార్వతీ సమేత పార్వతీశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం చివరి సోమవారం సందర్భంగా కార్తిక శోభ నెలకొంది. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకం చేశారు. భక్తులు శివలింగాకారంలో దీపాలను వెలిగించారు.

ముగిసిన కార్తిక పూజలు

గుడివాడ టౌన్: కార్తిక మాసం ముగుస్తున్న నేపథ్యంలోఆఖరి సోమవారం పట్టణంలోని శివాలయాల్లో భారీగా దీపారాధనలు చేశారు. స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని భీమేశ్వరస్వామి వారి దేవస్థానం (పెద్ద శివాలయం), గౌరీశంకరపురం లోని శ్రీ గౌరీశంకర స్వామి దేవస్థానం (చిన్నశివాలయం), బేతవోలులోని శ్రీ ఆనందేశ్వరి స్వామి దేవస్థానాల్లో దీపారాధనలు జరిగాయి.

పాడి రైతుల సంక్షేమానికి కృషి

ముదినేపల్లి రూరల్: జిల్లాలోని పాడిరైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. వైవాక, ఊటుకూరు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల పాలకవర్గ సభ్యులతో సోమవారం సమావేశాలు నిర్వహించారు. ఆంజనేయులు మాట్లాడుతూ పాడిరైతుల సంక్షేమానికి కృష్ణా మిల్క్ యూనియన్ అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి నాలుగు నెలలకు పది శాతం వంతున బోనస్ పంపిణీ చేయడంతో పాటు క్షీరబంధు, కల్యాణమస్తు, ప్రతిభ వంటి పథకాలు ప్రవేశపెట్టామన్నారు. అర్జా వెంకట నగేష్, గుడ్లవల్లేరు పాలశీతలీకరణ మేనేజర్ తోట సత్యనారాయణ, ఊటుకూరు సర్పంచ్ సుధాబత్తుల శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

స్పందనకు మూడు దరఖాస్తులు

గుడివాడ టౌన్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి మూడు దరఖాస్తులు వచ్చినట్లు ఆర్డీఓ పి.పద్మావతి తెలిపారు. గుడివాడ రూరల్ మండలం వలివర్తిపాడు గ్రామానికి చెందిన అద్దేపల్లి ప్రేమావతమ్మ కుటుంబ సభ్యులకు సంబంధించిన స్థలం పార్టేషన్ సర్వేచేయాలని, గుడివాడ బేతవోలుకు చెందిన డి.లెనిన్‌బాబు పరిసర ప్రాంతాల్లో మురుగు కాల్వల్లో సిల్టు తొలగించి సమస్య పరిష్కరించాలని, గుడివాడ సత్యన్నారాయణపురానికి చెందిన చోడవరపు సుజాత తనకు చెందిన భూమి కబ్జాకు గురైనది సమస్య పరిష్కరించాలని కోరుతూ అర్జీలు దాఖలు చేశారు.సంబంధిత అధికారులకు బదిలీచేసి పరిష్కారం అయ్యేలా కృషిచేస్తామని తెలిపారు.

సకాలంలో ఆస్తిపన్ను చెల్లించాలి

గుడివాడ టౌన్: పట్టణ పరిధిలోని ఇంటి, భూయజమానులు తమ ఆస్తిపన్ను వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను చెల్లింపు గడువు ఈనెల 31వ తేదీతో ముగుస్తున్న నేపథ్యంలో ఇంటి, ఖాళీస్థలం, నీటి పన్ను చెల్లించాలని కోరారు. అలా చెల్లించని పక్షంలో 2024 జనవరి 1వ తేదీ నుంచి బకాయి మొత్తంపై నెలకు నూటికి రూ.2 చొప్పున అపరాధ రుసుము వసూలు చేస్తామన్నారు. పన్ను మొత్తం చెల్లించి అభివృద్ధికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుక



మాట్లాడుతున్న జ్ఞానమణి

పామర్రు: క్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి అన్నారు. పామర్రు పట్టణంలో ఎబినైజర్ మినిస్టరీస్ సంస్థ ఆధ్వర్యంలో న్యూలైఫ్ గ్రౌండ్ నల్లగుంట దగ్గర గురుకుల పాఠశాల రోడ్డులో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జ్ఞానమణి పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఒక్కరు శాంతి క్షమ ధయ గుణాలను కల్గి ఉండాలన్నారు. ప్రభువు ఉపదేశించిన సూక్తులను అందరూ పాటించాలని అన్నారు. తన వలే తన తోటి వారిని ప్రేమించాలని అన్నారు. రెవరెండ్ జాన్ రెబ్బా మాట్లాడుతూ ప్రజలు అందరికీ మహాసంతోషకరమైన సువార్త మానము త్వరలో కలుగబోతోందని అన్నారు. ఏసు క్రీస్తు రాక కోసం ఎన్నో హృదయాలు ఎదురు చూస్తున్నాయని వారి కోర్కె త్వరలోనే నెరవేర బోతోందని అన్నారు. అందరి సంతోషంలో చిరునవ్వులలో ప్రభువును చూసుకోవాలని అన్నారు. అనంతరం బ్రదర్ హనోక్ ఆలపించిన సువార్త గానాలు ఆహూతులను అలరించాయి. తదుపరి చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను రంజింప చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు పరిశుద్ధ రాజు, పాస్టర్ జి.ప్రర్ణన్‌రాజు, కల్వరీ వర్షిప్ సెంటర్ ఇమ్మానుయేలు, ప్రార్థనా మందిరం సభ్యులు క్రీస్తు విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

పొలాలను పరిశీలించి నష్టం నమోదు చేయాలి

మొవ్వ: వీఏఏలు, వీఆర్‌వోలు క్షేత్రస్థాయిలో పంట పొలాలను సందర్శించి పంట నష్టం నమోదు చేయాలని తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు, వీఆర్‌వోలకు మిచాంగ్ తుపాను ప్రభావంతో పంట నష్టం నమోదుపై సమావేశం నిర్వహించారు. ఏవో కే ప్రసాద్ మాట్లాడుతూ మిచాంగ్ తుపాను వర్షాల వల్ల దెబ్బతిన్న పంట నష్టాన్ని అంచనా వేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయని, కోత కోయకుండా ఉన్న పొలాల్లో 33 శాతం పైగా నష్టం వాటిల్లిన పొలాల వివరాలను 33 అంశాలు ఉన్న ప్రొఫార్మాలో నమోదు చేయాలని, పనలకు నష్టం వాటిల్లిన పొలాల వివరాలను ప్రత్యేక జాబితా తయారు చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఏవిధమైన అవకతవకలు పాల్పడకుండా నమోదు చేయాలని సూచించారు.

వ్యాధి నివారణపై అవగాహన

కూచిపూడి(మొవ్వ): వ్యాధుల బారిన పడకుండా వ్యాధి నివారణ చర్యలు చేపట్టటం ప్రాధానమని మొవ్వ వైద్యాధికారి ఎం. వేదరాజ్ సూచించారు. డిసీజ్ ప్రివెన్షన్ అండ్ ట్రీట్మెంట్ మంత్ కింద కూచిపూడి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన నిర్వహించారు. కూచిపూడిలోని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లో డాక్టర్ వేదరాజ్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. బీపీ షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. గర్భిణులకు ఐరన్ టాబ్లెట్స్ పంపిణీ చేశారు.రోటరీ అధ్యక్ష కార్యదర్శులు కే రామాంజనేయులు, వీరాబత్తిన రవిబాబు, పాగోలు రమేష్ బాబు పాల్గొన్నారు.

నయనానందకరం.. శాంతి కల్యాణం

కైకలూరు: కార్తికమాస మహోత్సవాల్లో భాగంగా మాస శివరాత్రిని పురస్కరించుకుని కైకలూరు శ్యామలాంబ దేవాలయ ఆవరణలో రామలింగేశ్వరుని శాంతి కల్యాణం అత్యంత వైభవంగా సోమవారం జరిగింది. శివనామ స్మరణతో దేవాలయ ప్రాంతం మార్మోగింది. ఉప్పులూరు ముత్తంశర్మ, రాజశేఖర్ దంపతులు కల్యాణాన్ని నిర్వహించారు. గొర్తి వెంకటరమణ, లంక ఫణిశర్మ కల్యాణ క్రతువును పూర్తి చేశారు. ఆలయ ఈవో వీఎస్‌కే.శేఖర్, ఆలయ చైర్మన్ బూరుబోయిన మోహనరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో శ్యామలాంబ, మీసాల వెంకన్న స్వామి దేవస్థానాల చైర్మన్లు గుర్రం రాంబాబు, శివ, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

కలిదిండి: పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు డిజిటల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి వారికి ఉచితంగా ట్యాబ్‌లను అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు కొనియాడారు. ఎంఈవో కార్యాలయంలో సోమవారం విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో పి.ప్రభాకర్‌రావు మాట్లాడుతూ దృష్టి లోపం, వినికిడి లోపం ఉన్న దివ్యాంగ విద్యార్థులు సులభంగా విద్యాభ్యాసం చేయడానికి వీలుగా 33 యాప్‌లను ఇన్‌స్టాల్ చేసి డిజిటల్ విద్యను అందజేయడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులతో పాటుగా వినికిడి లోపంతో ఇబ్బంది పడుతున్నా ఉపాధ్యాయలకు ట్యాబ్‌లను అందచేసినట్లు చెప్పారు. 4 ట్యాబ్‌లను పంపిణీ చేశామన్నారు. ఏఎంసీ అధ్యక్షుడు పాము రవికుమార్, మసీముక్కుల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ విజిలెన్స్ తనిఖీలు



విద్యుత్ మీటర్లను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కైకలూరు: గ్రామాల్లో విద్యుత్ చౌర్యం చేస్తే భారీ జరిమానాలు విధిస్తామని విద్యుత్‌శాఖ విజిలెన్సు అధికారులు హెచ్చరించారు. కై కలూరు రూరల్ పరిధిలో గ్రామాలు, కొల్లేరు ప్రాంతాల్లో సర్వీసులను సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మొత్తం 2775 సర్వీసులను తనిఖీ చేయగా వాటిలో 136 సర్వీసులు అక్రమ విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. మొత్తం 471 కేవీ యూనిట్లకు అక్రమ వాడకానికి రూ.9,37,000 అపరాధ రుసుం వసూలు చేశారు. తనిఖీల్లో 45 బృందాలు పాల్గొన్నాయి. విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గుడివాడ ఈఈ బి.రామకృష్ణ మాట్లాడుతూ ఆయా అవసరాల నిమిత్తం కేటాయించిన విద్యుత్‌ను మించి వినియోగించవద్దన్నారు. గుడివాడ డివిజన్ విద్యుత్‌శాఖ ఏడీలు, ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.